# గడవని నిన్న!

జరిగినదే జరుగుతూంది. జరుగుతూంది కూడాను కొంత కాలంపాటు. నాకు తెలుసు.

మీ కెప్పుడైనా అనుభవం అయిందో లేదో కొంత మంది పక్కన నడుస్తోంటే విమానంమీద యెగిరిపోతున్నట్టుం టుంది. వాళ్ళతో మాట్లాడుతోంటే వుప్పెన కప్పిన సము ద్రంలో ఓడ ప్రయాణం చేసినట్టుంటుంది. తల తిరుగుతూ న్నట్లూ కాళ్ళకింద భూమి కరిగిపోతున్నట్లూ, ఎత్తి కుదేసి నట్లూ, ఏదో డోక్కున్నట్లూ, కళ్ళ వెనుకా, ముందూ కూడా పసరూ, సీ సిక్నెస్ వచ్చినట్లుంటుంది.

ఇలాంటి అనుభవం అందరికీ కలిగే అవకాశాలు చాలా తక్కువ. ఎందుకనంటే మీ జేబుల్లోనూ నా జేబుల్లోనూ పచ్చనోట్లెక్కడ దొరుకుతాయి? అందుకు తగిన హంగు ట్వీడ్సూటూ, క్రావెన్ ఏ సిగరెట్లూ, క్రేప్సోలుబూట్లూ, షాంపూ వాసనా మన కెక్కడుంటుంది? వుంటే మనకు కలక్కపోయినా కలిగేట్లు చూసుకోగలశక్తి యేర్పడుతుంది. లేకుంటే 'దౌర్భాగ్యులం.'

మనం దూరాన్నుంచి చూశామనుకోండి. అదొక అమెరికా! భూతల స్వర్గం. అంతా 'గుండ్రమే' అంతా 'నునుపే'

ఇంతకీ ఆ వ్యక్తి పేరు 'విన్నీ'. ఎక్కువ మందికీ తెలిసిన పేరు. అది అంటే తంటా వుండదు. కొంతమంది 'హసీనా' అనుకుంటారు. ఈ మధ్య పోర్చుగల్దేశంవాళ్లు వచ్చారు. వాళ్ళ నడిగితే 'సినోరిటా' అన్నారు. మలయాకెళ్ళే క్రూయిజర్లలో వచ్చిన అమెరికనులు 'జానీ' అన్నట్లుందే అన్నారు. ఐనా పేరులో యేముంది గనుక ?

ఆమాటకొస్తే ఆ జీవితంలోనూ యేమీలేదు విమానం యెగురుతున్నట్లూ. ట్రాం నడుస్తున్నట్లూ చివరికి ఆటం బాంబులా పేలిపోతున్నట్లూ. ఇట్లాగే అన్నాడు ఒకసారి ఒక కాలేజీ స్టూడెంట్ విన్నీ చెప్పిన సమాధానం విన్న తర్వాత. మానవుడు 'టాంగా' దిగి కుదుర్చుకున్న బేరం తెంపేసుకుని నడిచిపోయాడు. విన్నీ ఒక చిన్న నవ్వు నవ్వుకుని వూరుకుంది.

"అదే చా-చా ఆనందం" అంది విన్నీ.

అంత మాత్రాన విన్నీకి తన ఆనందం అంటే ఏమిటో తప్పక తెలుసుంటుందని అనుకునేందుకు వీలుందో, లేదో నాకు తెలియదు. (కొంతమంది నత్తిడిలోనూ, గల్లంతులోనూ, కైకలూరు మంగళవారం సంతలోనూ, చిలకలపూడి సంబరంలోనూ బ్రతికి ఆనందించామనుకుంటారు. కొంతమంది బెంగాలీ సంగీతం వింటూ సాయంకాలం తెల్లటి యెండలో పరుగెత్తే మేఘాల్ని, వూగే పచ్చటి గడ్డినీ చెట్లనీ గుర్తుకు తెచ్చుకుంటూ మైమరుస్తారు. పంజాబీ ఢోలక్ విరహ తాపాన్ని వింటూ తొడని చేత్తో బాదుకుంటూ వళ్ళు మరిచి

పోయ్యేవాళ్ళూ వున్నారు) కాని ఆనందమంటే యేమిటో విన్నీకి తప్పక తెలుసుండాలి.

ముఖం మీదికి వాలుతూ, నుదురుమధ్య అర్ధచంద్రాకారంలో తెగిపోయిన బంగారుజుట్టు అన్ని ముఖాలకూ అంత అందాన్నీయదు. ముక్కూ, చెక్కులూ యెక్కడ యెంతగా వుండాలో అంతగానే వుండటంవల్ల అందం అట్లా వొలుకుతుందేమో ననుకుంటాను. కొండలమధ్య కొలనులా స్వచ్ఛంగా వున్న తెల్లటి కళ్ళల్లో మధ్యధరా సముద్రపు నీలినీడలు ఆకళ్ళెత్తితే కనకాభిషేకం చేసితీరాలి. ఆ నోరు! ఒక్క పెదవులవంపే ననుకునేందుకూ వీల్లేదు. ఆ పెదవులు కదిలి గూడా మాట్లాడవు. మాట్లాడినా ఆ భాష అర్థమైతీరుతుంది. చిరునవ్వు తామరాకుమీది తెల్లనీటి బొట్టయి చర్రున సాగుతుంది. ఎక్కడ యెలా మాయమౌతుందో చెప్పలేం, నున్నగా, గుండ్రంగా, నిమ్మకాయై కూర్చున్న చుబుకానికీ ఆ చిరునవ్వుకీ వున్న అందం చూస్తేకాని...

ఆ సౌందర్యాన్ని అభినందించేందుకు మెత్తగా తెల్లగా మెరిసే కాంతులూ అవసరంలేదు. చక్కిలిగింతలుపెట్టే సంగీతమూ అవసరంలేదు. కల్లు కప్పే విస్కీ సోడాలూ అవసరంలేదు.

...

తోడు లేకుండా నడిచే విన్నీని నేనొక్కసారే చూచాను నిర్మలంగా వున్న కొలనులోకి. గాలి ఊదితే లేచే అలల్లా ... 'రీటా'లా...నడిచి వెళుతోంది. నన్ను చూడగానే వుప్పెనలో లేచిన కెరటం, వూగి, లేచి క్షణ కాలం నిస్తబ్ధత వహించినట్లయింది.

"ఇవ్వాళ వ్యాపారం వత్తిడి తగ్గిందా ?" ఎన్ని పళ్లు తెల్లగా మెరిశాయి !

"నే నెట్లాగున్నా నేమిటి నీకళ్ళకి?" మనిషంతా నిలువై సమాధానం చెప్పింది. బడాయివళ్ళు విరుచుకుంది. అతిశయం నిలబడింది. గర్వం పడగ విప్పింది. ఆత్మగౌరవంగల ఎంత మందో వస్తూంటారు. వెళ్తూంటారు. వాళ్ల కళ్లల్లో మంటలు చీడలు విప్పుకుంటాయి. వాళ్ళ నడిగాను రెండు మూడుసార్లు.

"ఏమిటా మంటలు !" అని.

"ఆకలి మంటలు" ఇలాంటిదీ, అలాంటిదీ కాదు ఆ ఆకలి. నర నరాల్నీ కాల్చుకుతిని, గుండెనంతా నమిలి యింక తినేందుకూ, నమిలేందుకూ యేమీ దొరక్క కళ్లల్లో గుండా బయట పడుతుంది. కనబడిన స్త్రీనల్లా కొరుక్కు తినబోతుంది. అవకాశం దొరికితే...పర్సులో నోట్లు బయట పడిం తర్వాతగాని కుక్కిన పేనుకాదు. అప్పటివరకూ కడుపంతా దేవుతూనే వుంటుంది. 'కీ' యిచ్చి బజార్లన్నీ తిప్పుతుంది. హోటళ్ళన్నీ వెదకిస్తుంది. చీకటి బజారుని కలుసుకున్న చోటూ, సినీమాహాలు బయటా, సముద్రం వొడ్డునా...

"ఇంతమంది ఆకలి యెలా తీరుస్తావు విన్నీ"

"నా ఆకలి చచ్చింది !"

ఆకలి చచ్చిన కడుపుదగ్గరకా యీ 'మలమలమాడే మనుషులు' పరుగెత్తుతారు !

"అంటే ?...అయితే...!"

"అయితే నా చచ్చిన ఆకలితో వాళ్ళ కుతి తీర్చు కుంటారు."

విన్నీ భాష నా కర్థంకాదు. యెన్నిసార్లు ప్రయత్నించ లేదు ?

"ఓ ! వాళ్లా. అమెరికన్లా...అబ్బ ! అట్లా యెప్పుడూ తినలేదు !"

"ఇవ్వాళ నేను ముక్క చెక్కలు"

ఇదీ ధోరణి ! ఎలా అర్థమౌతుంది ? మాటకీ, మాటకీ పొత్తు వుండను. ఆ భాషే వేరు. మళ్ళీ జాన్సన్ పుట్టాలి ఆ మాటల అర్థాల్ని అందరికీ అందించేందుకు.

అయినా—

'విన్నీ'తో గడిపిన ఘంటలు నిమిషాలుగా కూడా కన్పించవు. ఎప్పుడూ నవ్వుతూనే వుంటుంది. ఎప్పుడూ మాట్లాడుతూనే వుంటుంది.

"ఆ మాటలూ, ఆ నవ్వూ ఎక్కడ్నుంచి వూరతాయి ?"

"డబ్బుల నూతుల్లోంచి !"

"ఏం మాట్లాడుతూంటావు అంతసేపు ?"

"ఏముంది. ఫలానా మనిషి అలాంటి వాడని, మొన్న దెబ్బలాట జరిగిందనీ, నిన్న పోలీసువాళ్లతో ఘర్షణ జరిగిందనీ ఏమోలే ఆ మాటలికి అర్థం ఏమిటి ? ...

"అర్థంలేని మాటలు యెట్లా మాట్లాడగలవ్ విన్నీ"

"తెలివిగల నాలుక పనిచేయదోయ్ పిచ్చీ! నవ్వే మొఖం పనిచేస్తుంది !"

"ఇది వ్యాపారమా ?"

"కాదు, ప్రేమ !"

ఎన్నిసార్లు విన్నాను ఆ మాట !"

"మొన్న బ్రౌన్ కన్పించాడు, అతన్ని ప్రేమించాను. ఆ ఎర్రగా బారుగా వుంటాడే, అతన్ని నిన్న... ఇంతకు పూర్వం హోటల్లో కన్పించాడే, ఆ ముసలాడు... నన్ను ప్రేమించాట్ట !"

"అన్ని అబద్ధా లెట్లా ఆడతావ్ విన్నీ"

"ఏం అబద్ధాలు !"

"అదే... మొన్న దెబ్బలాట జరిగిందనీ"

"ఏ పుట్టలో యే పాముందో !"

"ఈమధ్య పోలీసుల వేట యెక్కువైంది. వాళ్ళూ నీలా నాలా గుడ్డలువేసుకుని, బయలుదేరి, డబ్బిచ్చి, 'ఆనం దించి' చివరికి 'ఋజువుచేసి' పట్టుకుంటారు. అబద్ధాలాడకపోతే యెట్లా? ఆ అబద్ధాలు మురుగుకంపు కొడతాయనీ తెలుసు. శవాలు కదిలినట్లు ఒంటరిగా, ఊరిబయట చీకటిరోడ్డుమీద నడుస్తూ, రావిచెట్టు కొమ్మలు ఊగిపోయేట్టు పాడుకోడూ గొడ్లకాడి బుడ్డాడు! ఎందుకు? సంగీతమంటే చెవికోసుకునే

అభిమ్మానం కనుకా? రావిచెట్టుమీద దెయ్యాలున్నవన్న మాట గుర్తుకొచ్చా?"

"ఎంతకాలం బ్రతుకుతావు ఇట్లా ప్రాణాలు గుప్పెట్లో పట్టుకునీ, బజారులో పారేసుకుంటానూ?"

"నే నాజరిగిందంతా మర్చిపోయాను. జరగబోయే్యదంతా రద్దు!"

విచారంతో గుండె పగిలి చావనివాళ్ళూ వున్నారు. ప్రేమతో పిచ్చెక్కి ఆత్మహత్యలు చేసుకోనివాళ్లూ వున్నారు. కాలం చంపని వ్యక్తులున్నారా? ఆ కాలం, ఈ కోరికల్నీ, ఈ ప్రేమనీ చంపగలుగుతుందా?

"...జరగబోయ్యేదంతా రద్దు"

ఆ మాట అంటూ విన్నీ నవ్వింది. వెంటనే నాకు బార్‌లో మూల కుర్చీమీద కూర్చున్న 'విన్నీ' గుర్తు కొచ్చింది. ముందున్న టేబుల్ పక్కగా తొంగి చూచే మోకాళ్ళ నునుపూ, కిరదికాళ్ళ వంపూ......నోట్లో నలభై డిగ్రీల్లో వంగి పొగ వదిలే క్రావెన్ఏ, రెండువేళ్ళతో పట్టుకునీ పట్టుకోకుండా బూడిద రాల్చేందుకు యత్నంచేస్తూ పొగ వదుల్తూ చిరునవ్వు నడిపించే విన్నీ! ఎంతమంది గుండెల్లో కుంపట్లు పెట్టిందో!

అలాంటి విన్నీ కట్టుడు పళ్ళు నవ్వినట్లు నవ్వింది.

ఏమన్నా న్నేను?

"ఎంతకాలం ఇట్లా బ్రతుకుతావు" అనేనా? ఎన్ని

సార్లడగలేదు అట్లా? అడిగినప్పుడల్లా విన్నీ తోక తొక్కిన తాచులా లేచింది.

[కోపంలో ఒక సుగుణం—కోపం వున్న ఆ కాస్సేపూ మనకున్న విచారం మరచిపోతాం!]

"కోపం రాలేదే" అన్నాను.

"ఎన్నిసార్లు తెచ్చుకోను?"

నేనొట్టి పిచ్చివాణ్ని. ప్రపంచం అంటే యేమిటో తెలియదు. వచ్చినవాణ్ణి...అసలు నాకీ గొడవంతా యెందుకు? పగలల్లా పనిచేస్తో, కుర్చీమీద కాలేసుకునో 'మార్స్' చాకొలెట్లు నములుతూనో. ఇట్లా రావటం యెందుకు? వచ్చినవాడిని 'ఆనందించి' పోగూడదూ? 'ఆనందించలేనివాణ్ణి' ఇలా వెంటబడ్డం యెందుకు? డబ్బు తగలేసుకోవడ మెందుకు? విన్నీని యేడ్పించేందుకా? జరిగినవన్నీ కెలికేందుకా? విన్నీ బిడ్డ యేమైతే నాకేం? విన్నీ ఉద్యోగం యేమైతే నాకేం? విన్నీ యజమాని యేంచేశాడో నాకేం తెలుసు?

ఇక్కడిదక్కడికి కదపనివాళ్లు కాలుమీద కాలు వేసుకు బతకడంలా? ఆఫీసులో టైపు కొడుతూ వ్రేళ్ళు ముక్కలు చేసుకున్న విన్నీ బిడ్డకి జీతం యెందుకు కట్టుకోలేక పోవాలి? కోతి ముఖాలికి ఆ బ్లౌజులెందుకు? ఆ లిప్‌స్టిక్సెందుకు? ఆ వానిటీ బాగ్సెందుకు? ఆ చివ్రోలెట్కారు లెందుకు? ఆ మార్సు చాకొలెట్లెందుకు? రోజు కన్ని సినిమాలెందుకు? ఆ సాలిగూడు చీరలెందుకు? ఇట్లా బతికే పనికిరాని వాళ్ళందరికీ విన్నీ అంటే ఇంత అలుసా? అంత తేలికా!

ఇప్పుడు చూడు వాళ్ల ముఃఖాల్ని ఈర్ష్యతో పొక్కులు పొక్కినట్లుంటాయి.

"విన్నీ అందుకేనా నువ్విట్లా—"

"నాతో మాట్లాడకు" అని కసిరింది విన్నీ!

"విన్నీ—!"

వట్టి పిచ్చి నాకు. అందమూ, ఆకర్షణా, మంచి తనమూ, తెలివీ అన్నీ ఒక్కసారి కావాలంటాను. ఆటం కనుక్కున్నవాళ్లతో బాంబులు చేసి అమాయకుల్ని చంపొద్దనీ, విమానాలమీద యెగిరేవాళ్లతో బాంబులు విసరొద్దనీ, ఓడలు నడిపేవాళ్లతో సముద్రాన్ని మందు గనుల మయం చేయొద్దనీ, రైళ్ళు నడిపేవాళ్లతో 'మిలిటరీ'ని చేరెయ్యొద్దనీ చెప్పానా ?

ఓట్లిచ్చి కుర్చీలమీద కూర్చోబెట్టిన వాళ్ళతో అంద రికీ పొట్టలు నిండేవరకూ ఉపన్యాసాలు మానమని చెప్పానా? అందరి బిడ్డలికీ చదువు అందేవరకూ—చెప్పానా?

నాదంతా వట్టి పిచ్చి.

"అవి మారిన్నాడు నేనూ కన్పించను" అన్నది విన్నీ.

"నువ్వన్నట్లు అవన్నీ మార్చాలని, మారుస్తున్న మనుషులూ వున్నారు. దేశాలూ వున్నాయి. అక్కడ 'విన్నీ'లు లేరు—"

"ఐతే...అదంతా వాళ్లకి విన్న—!"

"విన్నీ—!"

ఆగు, అట్లా చూడు—ఎందుకతను అట్లా ఇకిలిస్తాడు!—"

—:—